క్లుప్తంగా

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట: పోలంలో దాచి పెట్టిన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఆలేటివారిపల్లె సమీపంలోని చంద్రాయప్ప అనే రైతు పోలంలో 38 బాక్సుల కర్ణాటక మద్యం దాచిపెట్టారు. ఈ విషయమై సమాచారం అందడంతో వెలికి తీసి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 38 బాక్సుల్లో ఒక్కో బాక్సులో 96 చొప్పున మొత్తం 3,642 టెట్రా ప్యాకెట్లు ఉన్నట్టు తెలిపారు. దీని విలువ రూ.1,45,810గా చెప్పారు. ఈ మద్యాన్ని కర్ణాటక నుంచి ఎవరు తరలించారు? దాచి పెట్టింది ఎవరు అన్నదానిపై విచారణ చేస్తున్నామని చెప్పారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేస్తామని తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌కు 73 మంది ఎంపిక

కురబలకోట: డిక్సన్ టెక్నాలజీస్ ఇంటర్న్‌షిప్‌కు అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ విద్యార్థులు 73 మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. రెండు నెలలు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కేదార్ గౌరవ్ తదితరులు పాల్గొన్నారు.

12న రైల్వేకోడూరుకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ నెల 12న రైల్వే కోడూరుకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 4:30 నుంచి సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు ఉపాధ్యాయులు కేటాయించినందున ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజీనామా


రాజీనామా పత్రాన్ని చూపుతున్న చంద్రశేఖర్

నిమ్మనపల్లె : నిమ్మనపల్లి మండలంలో జనసేన పార్టీకి షాక్ తగిలింది. సోమవారం మండల మాజీ వైస్ ఎంపీపీ, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు ఈతకట్ల చంద్రశేఖర్ జనసేన పార్టీ సభ్యత్వానికి, పార్టీ మండల ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాసు చౌదరి, సీనియర్ నాయకులు పసుపులేటి హరిప్రసాద్‌కు పంపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కూటమి అభ్యర్థి షాజహాన్ బాషా విజయానికి జనసేన తరపున ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి కలిసి పనిచేస్తున్నామన్నారు. అయితే టీడీపీ నాయకులు జనసేన పార్టీ నాయకులకు, ప్రచార కార్యక్రమాలలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోగా, కనీసం సమాచారం సైతం తెలపడం లేదన్నారు. టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా తమకు ప్రాధాన్యతను తగ్గిస్తూ అవమాన పరుస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీలో కొనసాగడం ఇష్టం లేక తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ఉచిత సీట్లకు ఎంపికైన వారు 10వ తేదీ లోపు చేరాలి

– జిల్లా నోడల్ ఆఫీసర్ కరుణాకర్

మదనపల్లి సిటీ: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు లభించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులు, ఈ నెల 10 వ తేదీ లోపు ఎంపిక కాబడిన పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా నోడల్ ఆఫీసర్ మరియు సమగ్ర శిక్షా జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి జి.కరుణాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక నారాయణ ప్రైమరీ స్కూల్ లో మొదటి దశ 1 వ తరగతి ఉచిత అడ్మిషన్ కు ఎంపికైన బొమ్మిశెట్టి హేత్విని మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ రెడ్డి మరియు సీఆర్‌పీ సదాశివ రెడ్డిలు అడ్మిషన్ చేయించారు. కార్యక్రమానికి హాజరైన కరుణాకర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో, 1వ తరగతి ఉచిత అడ్మిషన్ల కోసం 1123 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, మొదటి దశలో 600 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ నెల 10వ తేదీ లోపు ఎంపికైన విద్యార్థులను పాఠశాలల్లో చేర్చాలని తల్లిదండ్రులను కోరారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎట్టి పరిస్థితులలో ఎంపికైన విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్ పొందిన వారి వివరాలతో ఒక రిజిస్టరు నిర్వహించాలన్నారు. బలహీన వర్గాల కోటాలో, ప్రైవేటు పాఠశాలలో ఉచిత అడ్మిషన్ లభించడం పట్ల విద్యార్థిని తల్లిదండ్రులు సుధీర్, లక్ష్మిలు హర్షం ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీతోనే ఎస్సీల అభ్యున్నతి

పీలేరు : వైఎస్సార్‌సీపీతోనే ఎస్సీల అభ్యున్నతి సాధ్యమని పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక షఫీ కల్యాణ మండపంలో ఎస్సీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి ఎంతో కృషి చేసిదన్నారు.


నిమ్మనపల్లె సచివాలయ భవనం

సామకోటవారిపల్లె ఆర్‌బీకే కేంద్రం


సామకోటవారిపల్లె వైఎస్సార్ విలేజ్ క్లినిక్


నిమ్మనపల్లె.. ప్రగతితో పరిఢవిల్లె

- వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో అందరికీ సంక్షేమం
- రూ.3 కోట్లతో నేలమల్లేశ్వరస్వామి, వీరభద్రస్వామి ఆలయాల అభివృద్ధి
- రూ.22 కోట్లతో నిమ్మనపల్లె – చింతపర్తికి డబుల్‌రోడ్డు


శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు

నిమ్మనపల్లె : మదనపల్లె నియోజకవర్గంలో నిమ్మనపల్లె అంటే...అభివృద్ధికి నోచుకోని మారుమూల మండల కేంద్రం. ఎన్నికల సమయంలో నాయకులు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించడం, ప్రజలు చెప్పిన సమస్యలన్నింటినీ పరిష్కరించేస్తామని, అభివృద్ధి బాట పట్టించేస్తామని హామీలు ఇవ్వడం... తర్వాత షరామామూలే.. ఐదేళ్లు అటువేపు కన్నెత్తి చూడకపోవడం...ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడక ముందు పరిస్థితి. దేవుడి దీవెనలతో, ప్రజలందరి ఆశీస్సులతో జగనన్న ప్రభుత్వం ఏర్పడ్డాక నేడు అభివృద్ధి ఘనంగా జరిగింది. ప్రతి గ్రామపంచాయతీలో కోట్ల రూపాయల విలువచేసే సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు...కళ్ల ఎదుటే సజీవసాక్షాలుగా కనిపిస్తున్నాయి. జగనన్న ఐదేళ్ల పాలనలో మండలంలో జరిగిన అభివృద్ధిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మహిళా సంక్షేమం

మండలంలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వైకేపీ–డీఆర్‌డీఏ ద్వారా వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో... వైఎస్సార్ ఆసరా కింద 5,202 మంది లబ్ధిదారులకు రూ.20.52 కోట్లు, వైఎస్సార్ సున్నావడ్డీ పథకంలో 7,852 మందికి రూ.7.50 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద 2,276 మందికి రూ.15.68 కోట్లు, జగనన్నతోడు పథకంలో 2,353 మంది లబ్ధిదారులకు రూ.2.35 కోట్లు, బ్యాంకులింకేజీ కింద 787 మందికి రూ.60.20 కోట్లు, జీవనోపాధికి వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల కింద 4,714 మంది లబ్ధిదారులకు రూ.24.72 కోట్లు సంక్షేమం అందింది.

రూ.80లక్షలతో మల్టీపర్పస్ గోడౌన్లు

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించేంత వరకు తమ ఉత్పత్తులను భద్రపరచుకునేందుకు వీలుగా నిమ్మనపల్లె ప్రాథమిక సహకారసంఘం, నాబార్డ్ నిధులు రూ.80లక్షలతో మండలంలోని రెడ్డివారిపల్లె, వెంగంవారిపల్లె గ్రామాల్లో 500 మెట్రిక్‌టన్నులు నిల్వ సామర్థ్యం కలిగిన 2 మల్టీపర్పస్ గోడౌన్లు నిర్మించారు.

ఆలయాల అభివృద్ధి

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన తవళం శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3కోట్లు నిధులు మంజూరుచేశారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదేవిధంగా రాచవేటివారిపల్లె పంచాయతీ బొంతలవారిపల్లె వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.90లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు నాడు-నేడు పథకంతో రూపురేఖలు మారిపోయాయి. మొదటివిడతలో 15 పాఠశాలలకు రూ.4.02 కోట్లు, రెండోవిడతలో 22 పాఠశాలలకు రూ.4.39 కోట్లు వ్యయంతో విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలికవసతుల కల్పన, ఆధునికీకరణ పనులు జరిగాయి. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా సర్వాంగ సుందరంగా తయారయ్యాయి.


నిమ్మనపల్లె-చింతపర్తి తూర్పుపల్లె డబుల్‌రోడ్డు


నిమ్మనపల్లె జగనన్న పాలవెల్లువ కేంద్రం


రెడ్డివారిపల్లె మల్టీపర్పస్ గోడౌన్

రూ.4కోట్లతో బ్రిడ్జిల నిర్మాణం



నిమ్మనపల్లె నుంచి చింతపర్తి మార్గంలో రూ.22 కోట్లతో 8.2 కిలోమీటర్ల మేర డబుల్‌రోడ్డు నిర్మాణం చేశారు. రోడ్డుపనులు చేయడంతో పాటుగా మార్గమధ్యంలో బాహుదా కాలువపై, నిమ్మనపల్లె పశువైద్యశాల వద్ద రూ.1.7 కోట్లతో 40 మీటర్లు, అగ్రహారం వద్ద రూ.2.3 కోట్లతో 60 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేశారు. గతంలో బాహుదా ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన సమయంలో అటుఇటువేపుగా రాకపోకలు నిలిచిపోయేవి. ప్రస్తుతం బ్రిడ్జిల నిర్మాణంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాఫీగా సాగుతోంది. మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలో కోటిరూపాయల వ్యయంతో సుమారు 6 కిలోమీటర్ల మేర మరమ్మతు పనులు చేశారు.

గ్రామ గ్రామాన సీసీరోడ్లు..



గతంలో ఎన్నడూలేని విధంగా నిమ్మనపల్లె మండలంలో ఎంపీ ల్యాడ్స్, జెడ్పీ, జీజీఎంపీ, మండల, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.41కోట్ల62లక్షలతో 114 పనులను చేపట్టారు. మదనపల్లె రోడ్డు నుంచి కొండయ్యగారిపల్లె మీదుగా వాల్మీకిపురం రోడ్డు వరకు రూ.2.6 కిలోమీటర్లు, చింతపర్తి రోడ్డు నుంచి పూలవాండ్లపల్లెకు 1.5 కి.మీ. మేర సీసీరోడ్డు నిర్మాణం, అగ్రహారం రెడ్డివారిపల్లె రోడ్డు నుంచి అరమడక, కూరపర్తి రోడ్డు వరకు కోటి రూపాయలతో దాదాపు 2 కిలోమీటర్లు తారురోడ్డు, నిమ్మనపల్లె పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ మీదుగా అగ్రహారం రోడ్డు నుంచి చింతపర్తి తూర్పుపల్లె వరకు డబుల్ రోడ్డు నిర్మాణం.. 60 కిలోమీటర్ల మేర అంతర్గత రోడ్లు వేయడం జరిగింది.

పేదలందరికీ ఇళ్లు...



పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంలో రాష్ట్రచరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం.జగన్ లక్షల సంఖ్యలో ఇళ్ల మంజూరుచేశారు. అందులో నిమ్మనపల్లె మండలంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న 2,071 మందికి రూ.38కోట్ల విలువచేసే భూమిని ఇవ్వడమే కాకుండా రూ.26కోట్ల39లక్షల92వేల నిధులు ఇళ్ల నిర్మాణానికి డీబీటీ కింద కేటాయించారు.

పీహెచ్‌సీ ఆధునికీకరణ : నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునికీకరణకు రూ.25లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశారు. రూ.9.83లక్షలతో ఆరుపడకల కోవిడ్‌భవనం, సీసీరోడ్లు, టైల్స్ ఏర్పాటు చేశారు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించండి


కురబలకోట: చేనేత నగర్‌లో ఎన్నికల ప్రచార దృశ్యం


బి.కొత్తకోటలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారం

ములకలచెరువు: మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సతీమణి కవితమ్మ ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని కురవపల్లి పంచాయతీలో ఆమే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ... ఇంటింటికి వెళ్లి జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుపై తమ రెండు ఓట్లను రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అమలైన సంక్షేమం, అభివృద్ధి అలాగే కొనసాగాలంటే ప్రజలందరూ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా ఫ్యాన్ ప్రచారం

కురబలకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి, బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, పోరెడ్డి విశ్వారెడ్డి, రెడ్డి కుమారి, మదార్ సాబ్, భూదేవి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో బి.కొత్తకోట పట్టణంలోని బీసీకాలనీ, బాబా టాకీస్ ఏరియా, బీరంగిరోడ్డు, నందిశెట్టివీధుల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు, ఎన్నికల మేనిఫెస్టోలను చదివి వినిపించారు. అభివృద్ధిలో ముందున్నామని, సంక్షేమం కూడా కొనసాగుతుందని చెప్పారు. గత ఎన్నికల కంటే అత్యధిక మెజార్టీతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాలిక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్. అయూబ్, రాయల్‌సలీం, ప్రభాకర్‌రెడ్డి, జీవీ.రామకృష్ణ, మహేష్, చిన్నప్పరెడ్డి, ఉస్మాన్, మోహన్ బాబు, రాయలసీమ రమేష్‌రెడ్డి, శెట్టిపల్లె రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో టైలర్ ఓబులేసు, చింతకాయల రెడ్డెప్ప, రామస్వామి, శివ, నాగేష్, గంగాద్రి, శంకరతో పాటు పలువురు సోమవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించారు. రాజకీయాలకతీతంగా అమలవుతున్న సంక్షేమ పథకాలకు తాము ఆకర్షితులై పార్టీలో చేరామని వారు పేర్కొన్నారు. అనంతరం ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి తమను గెలిపించేలా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట ఎంపీపీ మహమూద్, మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి రియాసత్ అలీఖాన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనిత,సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ కార్యం చంద్ర, కార్యవర్గ సభ్యుడు కొట్టి మల్లి, సుబ్బరాం,ఉపసర్పంచ్ ఆసిఫ్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు ధనలక్ష్మి, వెంకట్రమణ, సాదిక్ బాషా, అయూబ్, పుజేల్, సుబ్బిరెడ్డి, బోర్‌వెల్ నారాయణ రెడ్డి, ఖాదర్‌వలి, కేశవ, సయ్యద్‌బాషా, వెకట్‌రెడ్డి, సందీప్, వెంకట్, మహబూబ్‌బాషా, రాఘవ, మేకల చంద్ర, దండి శీనా, గిరీష్, ఉత్తన్న, మంజునాథరెడ్డి, రవికుమార్, కేఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి

తంబళ్లపల్లి: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఎంపిపి అనసూయమ్మ కోరారు. సోమవారం పరసతోపు పంచాయితీలో సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సరోజమ్మ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి కారపత్రాలు పంచుతూ సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి వివరించారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి మిధునరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డిల ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డి మలిరెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పీటీఎంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన నాయకులు


తంబళ్లపల్లె: పరుసతోపు పంచాయితీలో ఎన్నికల ప్రచారం

బీజేపీ, టీడీపీ అభ్యర్థుల

రోడ్‌షోకు స్పందన కరువు


తురకపల్లెలో పేలవంగా రోడ్‌షో

బి.కొత్తకోట/పెద్దమండ్యం: పెద్దమండ్యం మండలంలో సోమవారం బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సినీనటుడి గ్లామర్‌తో విజయవంతం చేయాలనుకున్న రోడ్‌షోకు స్పందన కరువైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్, టీడీపీ తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డి, బీజేపీనేత చల్లపల్లె నరసింహారెడ్డి తురకపల్లె నుంచి పెద్దమండ్యం వరకు రోడ్‌షో నిర్వహించారు. రోడ్ షోలో సినీనటుడు సాయికుమార్ పాల్గొన్నారు. మండలంలో ఈ కూటమి పార్టీలకు పెద్దగా ఆదరణ లేదు. దీనితో సినీగ్లామర్‌తో ప్రజలను రప్పించి రోడ్‌షో విజయవంతం చేసుకోవడం ద్వారా తమకు మద్దతు లభిస్తోందని చెప్పుకునే ప్రయత్నం చేశారు. పెద్దమండ్యంలో సోమవారం వారపుసంత కావడంతో రోడ్‌షో నిర్వహిస్తే జనం కనిపిస్తారని భావించి అక్కడ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో వైఎస్సార్‌సీపీకి తప్ప మరో పార్టీకి జనం నుంచి ఆదరణ లేదు.

మండుటెండలకు వర్షంతో ఉపశమనం


మదనపల్లెలో వర్షం కురుస్తున్న దృశ్యం

మదనపల్లె : ఎన్నికల వాతావరణం వేడెక్కిన వేళ.. నిప్పుల కొలిమిలా మారిన మండుటెండలకు సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. ఉదయం 9 గంటలైతే చాలు.. రోడ్డుమీదికి రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. ఉద్యోగాలు, రోజువారి పనులు చేసుకునేవారికి బయటకు రావడం తప్పట్లేదు. పొట్టకూటి కోసం వెళ్లాలి కాబట్టి.. మండుటెండలో మాడిపోతూనే పనులు చేసుకుంటున్నారు. మండుటెండలకు తోడు తీవ్రమైన ఉక్కపోత ప్రజల్ని ఇబ్బంది పెడుతోంది. భానుడి భగభగలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా తాకాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మదనపల్లిలో కురిసిన వర్షం పట్టణ ప్రజలకు ఉపశమనం కల్పించింది. సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం మొదలైంది. చాలా కాలం తర్వాత వర్షం పడటంతో భూమిపై మట్టి వాసన మైమరిపించింది. దాదాపు గంటన్నరకు పైగా కురిసిన వర్షంతో రోడ్లపై నీళ్లు నిలబడ్డాయి. వర్షం కురిసే సమయంలో ఉరుములు, పిడుగుల కారణంగా కరెంట్ పోవడంతో దాదాపు రెండున్నర గంటలకు పైగా ప్రజలు చీకట్లో గడిపారు. చల్లబడిన వాతావరణంతో ఒక్కసారిగా ప్రజలు సేదతీరారు.

రెండోరోజు ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలు-2024 ప్రక్రియలో భాగంగా ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులకు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండోరోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా మొదటిరోజైన ఆదివారం 1,906 మంది ఓటుహక్కును వినియోగించుకోగా, రెండోరోజు సోమవారం 701 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. బీటీ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ ఎస్.కవిత మన్నికెరి, ఆర్వో హరిప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ... మంగళ, బుధవారాల్లోనూ ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ఓటును సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినియోగించుకోవచ్చని, మిగిలిన వారెవరైనా ఉంటే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో తహసీల్దార్ రమాదేవి, డీఎల్‌డీఓ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.